క్లుప్తంగా

అన్నదానానికి బియ్యం వితరణ



బియ్యం బస్తాలను అందజేస్తున్న సర్పంచ్ మురళీకృష్ణ

రామకుప్పం: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి సోమవారోత్సవాల్లో భాగంగా నిత్యాన్నదానానికి సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ 20 బస్తాల బియ్యాన్ని వితరణ చేశారు. ఆదివారం ఆలయ ఆవరణలో నిర్వాహకులు చంద్రారెడ్డికి వీటిని అందజేశారు. వారు మురళీకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ అధ్యక్షుడు అప్పి, బీజీ.సుబ్రమణ్యం, గణేష్ రెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో పాడి ఆవు మృతి

బైరెడ్డిపల్లె: కరెంటు షాక్‌కు గురై పాడి ఆవు మరణించిన సంఘటన బేలుపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన ఇర్షాద్ తన పాడిఆవు ను పొలం వద్ద పశువుల కొట్టంలో ఉంచాడు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 3 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ఇర్షాద్ పశువుల కొట్టంపై వైర్లు పడ్డాయి. దీంతో విద్యుత్ వైర్లు పాడి ఆవుకు తగలడంతో అక్కడిక్కడే మరణించింది. దాదాపు రూ.లక్ష విలువ చేసే పాడి ఆవు మృతితో జీవనాధారం కోల్పోయామని ఇర్షాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంకటేష్ ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ స్తంభాలను మార్పించారు.

మున్సిపల్ ఎంహెచ్‌ఓకు షోకాజ్ నోటీసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్యశాఖ అధికారి(ఎంహెచ్‌ఓ)గా పనిచేస్తున్న డాక్టర్ లోకేష్‌కు కమిషనర్ అరుణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల నగరంలో పిచ్చి కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని, కరుస్తున్నాయంటూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎంహెచ్‌ఓ పట్టించుకోవడంలేదని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

2500 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 2500 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్టు టీటీడీ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఆమె ఆదివారం తిరుమల రాంభగీచా–2లోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో 243 మందిని, గరుడసేవ రోజు 774 మందిని అదనంగా ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవనాడు 136 టన్నుల చెత్తను తొలగించామన్నారు. రథోత్సవం నాడు మాడ వీధుల్లో ఇసుకను తొలగించేందుకు అదనంగా 278 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆలయ మాడ వీధుల్లో భక్తులకు తాగునీటిని అందించేందుకు 230 తాగునీటి పాయింట్లు ఉన్నాయని, బ్రహ్మోత్సవాల్లో అదనంగా 187 పాయింట్లు ఏర్పాటు చేశామని వివరించారు. గరుడ సేవ నాడు 681 మంది శ్రీవారి సేవకులతో భక్తులకు తాగునీరు అందించినట్టు చెప్పారు. కర్నూలులోని రీజనల్ ప్రయోగశాల, తిరుమలలోని టీటీడీ ఆహార ప్రయోగశాల నిపుణులు తిరుమలలోని తాగునీరు, ఆహార నాణ్యతను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. హోటళ్లలో ఆహార నాణ్యతకు సంబంధించి భక్తుల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నట్టు చెప్పారు. హోటళ్లలో ధరల పట్టికను ప్రదర్శించేలా సూచిస్తున్నామన్నారు.

ఆధ్యాత్మిక శోభితం



యాగశాలలో హోమం చేస్తున్న పండితులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. జై గణేష్ మహారాజ్‌కి జై అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. యాగశాలలో ఆదివారం ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో కొలువు దీర్చి సుగంధ పుష్పాలతో అలకరించి పూజలు చేశారు. ఉభయదారులు, ఆలయ అధికారులు మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

ఇక.. ఆమె సైతం కీలకం

- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు
- ఇప్పటికే పలమనేరు నియోజకవర్గంలో వారి స్థానం సముచితం



పలమనేరు: ఇకపై చట్టసభల్లో మహిళలు కీలకం కానున్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఇటీవలే పార్లమెంట్‌లో ఆమోదం పొందడం విదితమే. ఫలితంగా రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెంపునకు ఇది దోహదపడుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే దేశాభివృద్ధి, రాజకీయాల్లో మహిళలు కూడా తమవంతు కీలక పాత్ర పోషించడానికి అవకాశం కలిగింది. లింగ భేదాలకు చరమగీతం పాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే స్థానిక సంస్థల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 33 శాతానికి మించి మహిళలకు సీట్లను కేటాయించింది. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల్లో 50శాతం మహిళలకే కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కింది.

నియోజకవర్గంలో మహిళలకు సంబంధించిన వివరాలు	
మొత్తం ఓటర్లు: 2.57లక్షలు	మహిళా సర్పంచులు: 55(60శాతం దాకా)
మహిళా ఓటర్లు: 1.29లక్షలు	మొత్తం ఎంపీటీసీలు: 83
మొత్తం సర్పంచులు: 90మంది	మహిళా ఎంపీటీసీలు: 43
	మొత్తం కౌన్సిలర్లు(పలమనేరు మున్సిపాలిటీ): 26
	వీరిలో మహిళా కౌన్సిలర్లు: 16 (60శాతానికి పైగా)
	మొత్తం ఐదు జెడ్పీటీసీల్లో మహిళల సంఖ్య: 3

ఇదో చరిత్రాత్మక ఘట్టం



ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న మహిళా బిల్లుకు మోక్షం లభించడం ఆనందంగా ఉంది. కొత్త పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడంతో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి అవకాశం కలిగింది. మహిళలకు ఇదో చరిత్రాత్మక ఘట్టం.

–మొగసాల రెడ్డెమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్, బైరెడ్డిపల్లె

రాజకీయాల్లో పెనుమార్పులకు నాంది



భవిష్యత్తులో దేశ రాజకీయాలను మహిళలు శాసించే అవకాశం కల్పించారు. గతంలో మహిళలకు చట్టసభల్లో ఉన్న 13.3 శాతం రిజర్వేషన్లను 33శాతానికి పెంచడం ద్వారా మహిళల ప్రాతినిధ్యం పెరగనుంది. అన్ని రంగాల్లోనూ ఇప్పటికే మహిళలు ముందంజలో ఉన్నారు. భవిష్యత్తు రాజకీయాల్లో పెనుమార్పులకు ఇది నాంది పలుకుతుంది.

–సుష్మా, జెడ్పీటీసీ, పెద్దపంజాణి మండలం

వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయంగా మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించారు. ఇప్పటికే నామినేటెడ్ పదవుల్లోనూ సగభాగం పదవులు దక్కాయి. పలమనేరు మున్సిపాలిటీలోని మొత్తం 26 వార్డుల్లో 16మంది మహిళలలే ఉండడం చూస్తే ఈ ప్రభుత్వం మహిళలకు రాజకీయాల్లో ఎంత ప్రాముఖ్యనిస్తుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చట్టసభల్లో 33శాతం అవకాశంతో మహిళలు రాజకీయంగానూ దూసుకుపోవడం ఖాయం.

–పవిత్ర, మున్సిపల్ చైర్‌పర్సన్, పలమనేరు

మహిళలు తలచుకుంటే...



తమ కుటుంబాలను మహిళలు ఎలా నిలబెట్టుకుంటారో అలాగే తలచుకుంటే పట్టుదలతో ముందుకుసాగితే అన్ని రంగాల్లోనూ రాణిస్తారు. ఐదవ తరగతి చదివిన నేను పారిశ్రామికవేత్తగా లేనా? రాజకీయాల్లోనూ మహిళలు ముందంజలో నిలవడం ఖాయం. మహిళా బిల్లుతో రాజకీయాల్లో మహిళలు చక్రం తిప్పడం ఖాయం.

–రత్నారెడ్డి, రత్నా బయోటెక్ చైర్‌పర్సన్, కొలమాసనపల్లె

విద్యార్థి దశ నుంచి సామాజిక సేవ





మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రెడ్డెప్ప, సోమల: మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు

పుంగనూరు: విద్యార్థిదశ నుంచి సమాజసేవలో భాగస్వాములు కావాలని బసవరాజ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రెడ్డెప్ప అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెడ్డెప్ప మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత ఇస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో తరచూ పాల్గొనాలన్నారు. కళాశాలలను పరిశుభ్రంగా ఉంచడం, తోట లు పెంచడం, గుంతలమయమైన రోడ్లను శ్రమదానంతో బాగుచేయాలన్నారు. దత్తత గ్రామాల అభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలన్నారు. అలాగే గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయ సహకారాలు అందించడానికి విద్యార్థులు ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవరచుకోవాలని ఎస్‌ఎస్‌కేవీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు అన్నారు. ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయరాం, అధ్యాపకులు బట్టు శివయ్య, రవీంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి అభివృద్ధి పనులు సిద్ధం చేయాలి



పనులు పరిశీలిస్తున్న పెద్దిరెడ్డి, ఈవో చంద్రమౌళి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి నిర్వహించనున్న దసరా మహోత్సవాల్లోపు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి కోరారు. ఆదివారం బోయకొండలో జరుగుతున్న పనులను ఈఓ చంద్రమౌళితో కలిసి ఆయన పరిశీలించారు. దసరా మహోత్సవాలు నిర్వహించే తొమ్మిది రోజులపాటు భక్తులకు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అద్దాల మండలంలో కొత్తగా అద్దాలను మార్చాలని, వర్షానికి ఉరవకుండా మరమ్మతులు చేయాలని, బోయకొండ కింద నుంచి ఆలయం వద్దకు రహదారిలోని తొమ్మిది ప్రదేశాల్లో ఆర్చి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఈఓను కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు స్టేజ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ చెప్పారు. కార్యక్రమంలో నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, ఇమ్రాన్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న యూటీఎఫ్ స్వర్ణోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుంగనూరు: అక్టోబర్ 1న విజయవాడలో నిర్వహించనున్న యూటీఎఫ్ 50 వసంతాల స్వర్ణోత్సవాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ వద్ద యూటీఎఫ్ జెండాను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామచంద్రయ్య ఆవిష్కరించారు. అనంతరం పట్టణ వీధులలో మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాత పెన్షన్ విధానం పొందడం, అలాగే జీవో 117 రద్దుకు తీసుకోవాల్సిన కార్యచరణ గురించి స్వర్ణోత్సవాల్లో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, జీవీ.రమణ, జగన్ మోహన్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, ఎంవీ.రమణ, శ్రీనివాసులు, రెడ్డెప్ప, హేమలత, సుజాత, శివకుమారి, గాయత్రి, మంజుల పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన





వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, గంగవరంలో..

కుప్పం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సాయి మాత సేవాట్రస్ట్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆదివారం వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి (బెంగళూరు)కి చెందిన వైద్యనిపుణులు మొత్తం 320 మందిని పరీక్షించారు. ప్రధానంగా కార్డియాలజీ, న్యూరాలజీ, క్యాన్సర్, ఇఎన్‌టికి సంబంధించిన సమస్యల వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ప్రారంభించారు. వైదేహి ఆస్పత్రి డాక్టర్ లోకేష్, సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని లయన్స్ క్లబ్‌లో ఆదివారం ఉచిత నేత్ర చికిత్సా శిబిరాన్ని పలమనేరుకు చెందిన హేమచంద్ర సహకారంతో నిర్వహించారు. కుప్పం పీఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 90 మందిని పరీక్షించారు. వీరిలో 18మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్టు క్లబ్ ప్రెసిడెంట్ రఘు తెలిపారు.

టౌన్ బ్యాంకుకు పూర్వ వైభవం

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు సహకార టౌన్ బ్యాంకు కు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గిరింపేటలోని టౌన్‌బ్యాంకు బ్రాంచ్ కార్యాలయంలో బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడమే కా కుండా డిపాజిట్లకు ఇతర బ్యాంకుల కన్నా అధిక వడ్డీ చెల్లిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బ్యాంకు పాలకవర్గం అవినీతికి పాల్పడి బ్యాంకు ప్రతిష్టను దిగజార్చారని ఆరోపించారు. దీంతో కొంత ఆర్థి క ఇబ్బందులు తలెత్తాయన్నారు. ప్రస్తుత పాలకవర్గం బ్యాంకు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. బ్యాంకు ఆర్థిక లావాదేవీలు రూ.2 కోట్ల లాభా ల దిశగా పురోభివృద్ధి చెందుతోందన్నారు. ఖాతాదారులు కూడా బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. బ్యాంకు పాలకవర్గ చైర్మన్ రాంగణేష్, సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

కుంభాభిషేక పూజలు



గుడిపాల: మండలంలోని గొల్లమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన సాయి బాబా ఆలయంలో ఆదివారం కుంభాభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూజల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, పురుషోత్తంరెడ్డి, వరదరాజులురెడ్డి ఉన్నారు.

కోలాహలం.. నిమజ్జనం



చౌడేపల్లె: తరలుతున్న బొజ్జ గణపయ్య



పెద్దపంజాణి: గుండ్లపల్లెలో ఉట్లోత్సవం



చౌడేపల్లె: టీచర్స్ కాలనీలో..

చౌడేపల్లె: స్థానిక బజారువీధి మృత్యుంజయేశ్వర స్వామి ఆలయం వద్ద నెలకొల్పిన వినాయక స్వామి విగ్రహాన్ని శ్రీ వినాయక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిమజ్జనం చేశారు. విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ప్రత్యేక పూల నడుమ ముత్యాలపల్లకిలో స్వామివారిని ముస్తాబు చేశారు. కేరళ, తమిళనాడు వాణింబాడిల ప్రత్యేక వాయిద్య బృందాల నడుమ ఊరేగింపు సాగింది. అలాగే రాజనాలబండ నుంచి దేవరెద్దుతో పాటు పిల్లలగోవి, కోయదొరల బృందం, సాంస్కృతిక కళాబృందం సభ్యుల నడుమ ఊరేగింపు సాగింది. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఇక, పట్టణంలోని టీచర్స్ కాలనీ, రాములవారి గుడి, సంతగేటు వీధి, నడివీధి గంగమ్మ, కురప్పల్లె, బస్టాండు తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయకుడి విగ్రహాలను కూడా నిమజ్జనం చేశారు.

సదుం మండలంలో..

సదుం: స్థానిక వాల్మీకివీధి, జాంద్రపేటలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. యువకులు రంగులు చల్లుకుంటూ కోలాహలం చేశారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల: మండలంలోని ఇందిరమ్మ కాలనీ, జాండ్లవారిపల్లెలో వినాయకస్వామి విగ్రహాల నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ట్రాక్టర్లలో పుర వీధులలో బ్యాండు మేళాల హోరు, యువత కేరింతల నడుమ ఊరేగింపుగా చెరువులకు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఉదయం ఉట్లోత్సవం నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువతీ యువకులు పోటీ పడ్డారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

పుంగనూరు: చవితి సందర్భంగా మండలంలోని గళం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకస్వామి విగ్రహానికి ఆదివారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ద్వారకనాథ్ పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనం చేశారు.మండలంలో పలుచోట్ల గణనాయకుని ప్రతిమలు, మండపాల ఏర్పాటుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ నుంచి ఆర్థిక సహాయం చేశారన్నారు. అనంతరం గ్రామ వినాయక యూత్ సభ్యులు ఎంపీపీని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యం, గంగాధర, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం నిమజ్జనోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాలకు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం యువకులు కేరింతలు కొడుతూ మండపాల వద్ద ఏర్పాటు చేసిన నీటి ఉట్లను పగుల కొట్టారు. గుండ్లపల్లెలో ఉట్లోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆ తర్వాత వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై కొలువుదీర్చి, మేళతాళాలతో పెద్దఎత్తున బాణసంచా పేల్చుతూ, ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. యువకులు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. పలు గ్రామాల్లో మండపాల వద్ద అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక నెహ్రూనగర్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను ఆదివారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ట్రాక్టర్‌లో కొలువుదీర్చి పూజలు చేశారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా మోత నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి బైరెడ్డిపల్లె పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. పిల్లలు, యువకులు, మహిళలు ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక రెడ్డికాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. యువకుల కేరింతలు, డప్పుల హోరు, జై..జైగణేషా నామస్మరణల మధ్య వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



సదుంలో..





పుంగనూరు: మంగళంలో వినాయకస్వామికి పూజలు చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పెద్దపంజాణి: రాయలపేటలో..



రామకుప్పంలో..



రొంపిచెర్ల: ఇందిరమ్మ కాలనీలో..



రొంపిచెర్ల : జాండ్లవారిపల్లెలో..



బైరెడ్డిపల్లె: ఎస్సీ కాలనీలో..



బైరెడ్డిపల్లె: నిమజ్జన కార్యక్రమంలో పిల్లలు